# మంత్రి కేటీఆర్ సభ సక్సెస్

**పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు**

కామారెడ్డి, అక్టోబర్ 7: కామారెడ్డి పట్టణంలో ఐటీ, పుర పాలక శాఖ మంత్రి కేటీఆర్ సభను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించగా నియోజకవర్గం నలు మూలల నుంచి బీఆర్ఎస్ అభిమానులు, గులాబీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కామారెడ్డి పట్టణం ఎటుచూసినా గులాబీ మయంగా మారిపోయింది. మంత్రి కేటీఆర్‌ను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది.



సభకు తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్న రాజేశ్వర్

## ముదిరాజ్‌లకు రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించాలి

కామారెడ్డి, అక్టోబర్ 7 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ముదిరాజ్‌లకు రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించాలని, ముదిరాజ్ భవనం మంజూరు చేయాలని కోరుతూ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పున్న రాజేశ్వర్ మంత్రి కేటీఆర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించి సభలోనే మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పిస్తామని, ఎమ్మెల్సీ పదువులు, నామినేటెడ్ పదువులు కల్పిస్తామని అన్నారు. ముదిరాజ్‌లకు తప్పకుండా న్యాయం చేస్తామని చెప్పారు. కామారెడ్డి జిల్లాలో ముదిరాజ్ భవనానికి ఐదెకరాల్లో రెండు కోట్ల రూపాయలను మంజూరు చేస్తామని అన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

### సీఎం కేసీఆర్ మైనారిటీల పాలిట దేవుడు



ఉచితంగా కుట్టుమిషన్లు, మైనారిటీ బంధు ఇచ్చి మైనారిటీల పాలిట సీఎం కేసీఆర్ దేవుడయ్యాడు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా మైనారిటీలకు లబ్ధి చేకూరే పథకాలు ఇవ్వలేదు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ఎన్నో పథకాలు అమలు చేస్తూ మాకు అండగా నిలుస్తున్నాడు. ఎన్ని పార్టీలోళ్లు వచ్చిన వాళ్లను మా ఓటుతో తరిమి కొట్టి సీఎం సార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం.

**- హసినా, కామారెడ్డి**

### ఇక్కడి నుంచి పోటీ చేయడం మా అదృష్టం



సీఎం కేసీఆర్ సార్ కామారెడ్డి నుంచి పోటీచేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. మా ప్రాంతానికి కాళేశ్వరం నీళ్లు రావాలన్న.. మా ఏరియా అభివృద్ధి కావాలన్న అది సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మెజారిటీతో కేసీఆర్ సార్‌ను గెలిపించుకుంటాం.

**- కుమ్మరి సత్తవ్వ, కామారెడ్డి**

### కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తాం



సీఎం కేసీఆర్‌ను కామారెడ్డి నుంచి భారీ మెజారిటీతో గెలిపిస్తాం. సీఎం సార్ దళితులకు దళిత బంధు ఇచ్చి మమ్మల్ని ఆర్థిక శక్తివంతులుగా తీర్చిదిద్దుతున్నాడు. గతంలో దళితులను అన్ని ప్రభుత్వాలు చిన్న చూపు చూశాయి. సీఎం కేసీఆర్ హయాంలో దళితులు అభివృద్ధి చెందుతున్నారు. సీఎం సార్‌కు గంప గుత్తగా ఓట్లేసి గెలిపించుకుంటాం.

**- చేదే శంకర్, పాల్వంచ మండలం**

### వృద్ధులకు ఆసరాగా నిలుస్తున్నడు



రెండు వందలు ఉన్న పింఛన్‌ను సీఎం కేసీఆర్ రెండు వేలకు పెంచి ఇచ్చి మాకు ఎంతో అసరాగా నిలుస్తున్నడు. కేసీఆర్ సార్ ఇక్కడి నుంచి పోటీ చేస్తుండని మీటింగ్ కు వచ్చినం. సీఎం సార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం.

**- కుండెల్లి గంగాధర్, లింగుపల్లి, కామారెడ్డి మండలం**

### మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు



సీఎం కేసీఆర్ మహిళల కోసం కల్యాణలక్ష్మి, బీడీ పింఛన్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ ఇలా ఎన్నో పథకాలను అందిస్తున్నారు. సీఎం కేసీఆర్ సార్‌ను కామారెడ్డి నుంచి గెలిపించుకుంటాం. మహిళల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు మాకు ఇస్తడు.

**- సంపంగి మరియ, కామారెడ్డి**

## మాడ్యూల్ శిబిరాలతో మానవతా విలువల పెంపుదల



మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సామ్‌కోషి

నిజామాబాద్ లీగల్/కామారెడ్డి, అక్టోబర్ 7 : చట్టం అందరి చుట్టం అయితే మానవతా విలువలు పెంపొందుతాయని, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి సామ్‌కోషి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'లీగల్ మాడ్యూల్ క్యాంప్' ను శనివారం నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి సుమలత, న్యాయసేవా సంస్థ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా జడ్జి సునీత కుంచాల, బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాడ్యూల్ క్యాంప్‌లకు మోడల్‌గా నిజామాబాద్ జిల్లా నిలవాలని ఆకాంక్షించారు. రైతాంగానికి చట్ట పరిజ్ఞానం కల్పించేందుకు వీలుగా అగ్రిలీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి, రైతులకు న్యాయవ్యవస్థ అండగా ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నామన్నారు. న్యాయసేవలు అందక, ఎవరూ నష్టపోవద్దనే ఉద్దేశంతో డిఫెన్స్ లీగల్ ఎయిడ్ సిస్టం వ్యవస్థకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రోటరీ విన్నర్ వీల్ క్లబ్ ఆర్థికసాయంతో వీల్ చైర్స్‌ను దివ్యాంగులకు పంపిణీ చేశారు. జస్టిస్ సుమలత మాట్లాడుతూ.. ఒక పరిమితిలో ప్రభుత్వ న్యాయవ్యవస్థల ఆర్థిక, న్యాయ సహాయాలు ఉంటాయని, వాటిని ఉపయోగించుకొని స్వతహాగా ఎదగాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. తాను కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం.. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రజారోగ్యం కోసం నిర్వహించిన ర్యాలీ తనలో స్ఫూర్తిని నింపిందని చెప్పారు. జిల్లా పోలీస్ శాఖ తరుపున సహాయ సహకారాలు అందిస్తామని సీపీ సత్యనారాయణ తెలిపారు. చిన్న చిన్న వివాదాలకే ఎక్కువ కేసులు వస్తున్నాయని కామారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీదేవి అన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, జిల్లా అదనపు జడ్జిలు షౌకత్ జహన్ సిద్దిఖీ, శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బూ ఉపాధ్యాయ్, గోపీకృష్ణ, అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, యాదిరెడ్డి, ప్రభుత్వ న్యాయవాదులు శ్రీహరి ఆచార్య, యెండల ప్రదీప్, బార్ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుజాత పాండు, కార్యదర్శి సులోచన, సభ్యులు అనుపమ సుబేదార్, యెండల రజని, దర్శన జైన్, కామారెడ్డి ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అదనపు జిల్లా జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, మెజిస్ట్రేట్ భార్గవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## మేమంతా పోచారం వెంటే..

- సంపూర్ణ మద్దతు ప్రకటించిన పీఎస్ఆర్ బీడీ వర్కర్స్ కాలనీవాసులు, మాల సామాజికవర్గం సభ్యులు
- బాన్సువాడలో సభాపతికి ఏకగ్రీవ తీర్మాన కాపీ అందజేత



స్పీకర్‌కు తీర్మాన పత్రం అందజేస్తున్న మాల సామాజికవర్గం సభ్యులు

బాన్సువాడ, అక్టోబర్ 7: బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా గ్రామాలు కదిలివస్తున్నాయి. పోచారం వెంటే ఉంటామని ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నాయి. బాన్సువాడ పట్టణం తాడ్కోల్ పీఎస్ఆర్ బీడీ వర్కర్స్ కాలనీవాసులు, నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్ గ్రామం మాల సామాజికవర్గం సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డికే మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన కాపీని బాన్సువాడలో స్పీకర్‌కు శుక్రవారం రాత్రి అందజేశారు. తామంతా పోచారం వెంటే ఉంటామని ఈ సందర్భంగా కాలనీవాసులు పేర్కొన్నారు. అలాగే బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోచారం శ్రీనివాసరెడ్డికి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని గ్రామ బోయి సంఘం కులస్తులు ఏకగ్రీవంగా తీర్మానించి స్పీకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, గౌస్, హన్మాండ్లు, బాల్‌రాజ్, బాలయ్య, కృష్ణ, జమీలా, షబానా, అనిత, గంగమణి, అనిల్, శ్రావణి, అశ్విని, చాంద్‌బీ, పద్మ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్‌లోకి 30 మంది బీజేపీ కార్యకర్తలు

**గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్**



మాధవనగర్ గ్రామ బీజేపీ కార్యకర్తలకు గులాబీ కండువాలు వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బాజిరెడ్డి జగన్

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 7 : నగర శివారులోని మాధవనగర్ గ్రామానికి చెందిన 30 మంది బీజేపీ కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాస ప్రాంగణంలో ధర్పల్లి జడ్పీటీసీ, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని బాజిరెడ్డి జగన్ సూచించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ప్రశాంత్, రాకేశ్‌గౌడ్, సద్దాం హుస్సేన్, లక్ష్మణ్, వినోద్, నవీన్, రజినీకాంత్, సుమన్, రణవీర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో 4వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్ చౌదరి, కార్యదర్శి యాదగిరిగౌడ్, బీసీ విభాగం అధ్యక్షుడు మల్లెపూల నర్సింహాచారి, బీఆర్ఎస్ నాయకులు అభిలాష్, ముత్యాల వినోద్, బీమా శంకర్, బీఆర్ఎస్ రూరల్ సెగ్మెంట్ నాయకుడు విజయ్ పాల్గొన్నారు.

## డీఎస్సీ ఆన్‌లైన్ కోచింగ్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : బీసీ స్టడీ సర్కిల్ – హైదరాబాద్ ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ సీహెచ్.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోచింగ్‌లో భాగంగా వివిధ టెస్టులు ఉంటాయని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 12వ తేదీలోగా నిజామాబాద్‌లోని సుభాష్‌నగర్‌లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలని సూచించారు. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా వంద మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, డీఎస్సీ పోస్టుకు దరఖాస్తు చేసిన కాపీ, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08462–241055 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.